రండి. ఇంటిలో పురుడు సమయము వచ్చింది. వచ్చేది కొత్త. కార్డుపెట్టుకో లేదు. కటాకించి ఒక పావుటిన్ ఖరీదుకు దయచేసి చీకటింటికి వెలుగు పెట్టండి బాబూ!" అన్నాడు. ఇప్పుడు శెట్టికి వికాసము హెచ్చింది. అసలు చీకటికొట్టు బేరాలకు ఆహుతయింది తప్పని సరిగా బడిపంతుళ్ళేగా. ముసలి కోటుతో అర్ధాకలితో కాలేకడుపు కప్పబడినా, ముఖాన్నే ఆకలివ్యాకమయే దీనతతో మర్యాదగా ఎట్టెదుటనున్న యీతనితో అన్నాడు. 'పోలీసుబంట్రోతు నుండి బడి పంతులువరకు కార్డు లేకుండ యివ్వాలంటె స్టాకు ఎక్కడ నుండి వస్తుంది. ఇష్టమైతే బ్లాకులో అందిస్తా.'

అయ్యా కిరసీన్ వైటులోను, రెడ్‌లోను ఉంది కాని బ్లాకులో వచ్చిందండీ అన్నాడు పేలముఖంతో అయ్యవారు. ఏమి అమాయకమయ్యా. బ్లాకు మార్కెటింగు రేటులో రు 3-0-0 లు చెల్లించి పావు డబ్బా పట్టుకువెళ్ళు అన్నాడు సూటిగా వర్తకుడు. సొమ్ము చెల్లించేడు. విజిలు ఊదేడు. దాపులో నున్న పోలీసులు చేరారు. అంతా సి. ఐ. డి. తమాషా అని తెలిసికున్నాడు శెట్టి. కంగారుపడ్డాడు. చీకటికొట్టులో బందీయైనాడు; కటకటాలలో కటకటపడ్డాడు. డాక్కురూములో 'బ్లాకు' అంటూ కలవరించేడు.

ఎస్. వెంకట నాయుడు.

* * *

## స్వాగతము

తన వివాహం నెల రోజులుందన్న దగ్గరనుంచీ, తన పెళ్ళినాటికి తప్పకుండా రమ్మని మా జనార్దన్ పట్టుపట్టడంచేత నేను మొదట వెళదామనే అనుకున్నాను. కాని వాడిపెళ్ళికి వారం రోజులు ముందుగా మా మామగారి దగ్గరనుంచి సామర్లకోటలో మా మరదలుకు పెళ్ళవుతుందని శుభలేఖ రావడంచేత ఒక స్నేహితుడి పెళ్ళికోసం మామగారి ఆహ్వానాన్ని తిరస్కరించడం యిష్టంలేక సామర్లకోట వెళ్ళడానికి ఒక వారంరోజులు సెలవుపెట్టి బయల్దేరా. నేను పెట్టె బేడా సర్దుకుంటూండగా జనార్దన్ వచ్చి "ఏంరా! బ్రదర్! ఎక్కడేవిటి కమాను?" అని అడిగాడు. నేను సంగతంతా చెప్పి "క్షమించు బ్రదర్! రెండూ పెళ్ళిళ్ళూ ఒక్క ముహూర్తానే అవుతున్నాయి. ఇప్పుడు కాని వెళ్ళకపోతే తన కూతురు పెళ్ళికి రాలేదని మా మామగారు మాగుమ్మం త్రొక్కడు! మరేమీ అనుకోకు అని చెప్పి బయల్దేరా......నేను సామర్లకోట చేరేసరికి మాముగ్గురు తోడల్లుళ్ళూ వచ్చారు...మగపెళ్ళి వారా రాత్రి రాజమండ్రీనుంచి వస్తారనితెలిసింది. నన్ను మామామగారారాత్రి పెళ్ళివార్కి స్వాగతమిచ్చేందుకు ఒక కారిచ్చి స్టేషనుకి పంపించాడు. నేను స్టేషను చేరేసరికి ట్రయిను 40 నిముషాలు లేటని తెలిసింది. ఏమిచేయడానికి తోచక నేను సీటుమీద చేరబడ్డా. చల్లనిగాలివీచడం చేత నాకు వెంటనే బాగా నిద్రపట్టింది. నేను నిద్రలేచేసరికి ట్రయిను స్టేషన్ని వదలి పావు గంటయిందని తెలిసింది. నేను తడబడుతూ లేచి ప్లాటుఫారం అంతా వెదికాను. నాకు పెళ్ళివారు కనబడలేదు. కాని మా జనార్దన్ కనిపించాడు. తనపెళ్ళికి కాకినాడ వెళుతున్నామని, ఆరాత్రి అక్కడెక్కడేనా బసచేసి తెల్లవారుఝామున కాకినాడ ప్యాసింజరుకందుకుంటామనిచెప్పాడు- "మరెక్కడో ఎందుకు ఈరాత్రికి మా యింట్లోనె వుందురు గాని రారా!" అని చెప్పి ఆ వచ్చిన పదిమందిని కార్లో మాయింటికి తీసుకొనివెళ్ళా. కారు ఇంటి ముందు ఆపి ముందుగా ఈసంగతి మామగారికి చెప్పాను. పెళ్ళివారికోసం వండిన వంటలు బావుగావుండడంచేత మామామ అత్త సరే నన్నారు. నేను వెంటనే ఈసంగతి జనార్దనకి చెప్పి అందరిని ఇంట్లోకి తీసుకొనివెళ్ళాను. వాళ్ళనుచూచి మామామగారు "అదేవిటిబాబూ! పెళ్ళివారు రాలేదన్నావు. నితోనే తీసికొచ్చి! యిదేం హాస్యం చెప్పూ!" అని మామామగారు అంటూ ఉంటె నేను తెల్లబోయాను. జనార్దన్ మాత్రం విరగబడినవ్వుతున్నాడు. మా కాబోయేతోడల్లుడు వాడనని నాకప్పుడు తెలిసింది. మా జనార్దన్ తా నాడిన నాటకమంతా చెప్పేసరికి అంతా నవ్వుకున్నారు.

పంతుల కృష్ణారావు.

* * *

## శృంగభంగము

అప్పుడే ఏడున్నరయింది. బస్సు హారన్ వినిపించింది. ఎక్కడ బస్సు మిస్ అగుతావో అని కాఫీ చాల వేడిగా వున్నా రెండుగ్రుక్కలలో తాగేసి బస్సెక్కేను. శీతాకాలం కనక చాలా చలిగా వుంది. బస్సులో ప్రయాణీకులు ఎక్కువమంది లేరు. నలుగు రుంటారేమో డ్రయివరు కండక్టరుకాక. బస్సు స్టార్టయింది. ఇంతలోకి ఎక్కడనుంచో పరుగెత్తుకొనివచ్చి నలుగురు పోలీసులు ఎక్కారు. వాళ్ళు పోలీసుస్టేషనువద్ద దిగిపోతామని కండక్టరుతోచెప్పి ఏదో తీవ్రంగా మాట్లాడుకుంటూ మధ్య మధ్య నవ్వుతున్నారు. డ్రైవరు స్పష్టంగా గొణుగుకోవడం విన్నాను నేను "డబ్బిచ్చే పేసెంజర్లు లేకపోయినా F S. పోలీసు......లు వదలరు" అని బస్సు పోలీసుస్టేషను దాటిపోయింది. కాని పోలీసులుమాత్రం ఏదో చెప్పుకొని నవ్వుకుంటున్నారు. ఇంతలో ఒకడు పోలీసుస్టేషను దాటిపోయిందని చూసి వెనకనున్న బెల్లును గణగణగణగణ కొట్టాడు. అది కొట్టింది పోలీసు అని తెలిసివుండి కూడా వాళ్ళకి ఎలాగయినా శృంగభంగంచేయాలని "ఓరి సన్యాసీ! నికెన్నిసార్లు చెప్పినా బుద్ధి లేదెం? బెల్లు అన్నిసార్లు కొట్టవద్దంటే" అన్నాడు డ్రయివరు ఏహ్యాభావంతో. పాపం ఆ పోలీసు మొఖాన్ని గంటు వేసినా నెత్తురులేదు. ఇంతలో అన్నాడు కండక్టరు "కాన్‌స్టేబులు గారండీ కొట్టారు" అని కష్టంమీద నవ్వు ఆపుకుంటూ. "అయ్యో! మీరా? మాబుద్ధి లేని నన్యాసి అనుకున్నాను. తమరు 'డ్రైవరూ ఆపవోయ్' అంటె ఆపేవాణ్ణే" అంటూ బ్రేకువేశాడు. పోలీసులు దిగి వెళ్ళిపోయారు నాటినుంచి నేటివరకూ వాళ్ళు మళ్ళా ఆబస్సు ఎక్కలేదు.

జి. వి. అప్పారావు పంతులు.